ఆశయానికీ ఆచరణకీ నడుమ గగనమంత తేడా వుంటే ఆదర్శానికి ఆవలవైపు వుండేవన్నీ గులాబీ ముళ్ళేనా?

# ఆదర్శానికి ఆవలివైపు

సోమయాజుల సోదరులు



ఆ అనాధ శరణాలయం లోకి అడుగు పెడుతూ నాలుగవసారి తనని తాను ప్రశ్నించుకున్నాడు విశ్వపతి. "నేను చేస్తున్నది సరైన పనేనా" అని. అంతలోనే "ఎందుకు కాదు? ఒక అనాధకి తను ఆశ్రయం కల్పించాలను కుంటున్నాడు. అదెంత గొప్ప ఆలోచన!" అని సమాధాన పరచుకున్నాడు.

నేరుగా వెళ్ళి దుమ్ముపట్టిన ఒక ఫైలు తిరగేస్తున్న ముసలాయన్ని అడిగాడు. "నేను ఇక్కడ నుండి ఒక అనాధని నాతో తీసుకువెళదామనుకుంటున్నాను మీ అనుమతితో"

ఆ ముసలాయన తన సర్వీస్‌లో ఇలాంటి వాళ్ళని చాలామందిని చూసాడు. నడి వయస్సు వచ్చే వరకూ పిల్లలు పుడతారేమోనని ఎదురుచూసి, విసిగి పోయి, అనాధ శరణాలయం నుండి పిల్లలను తీసుకువెళ్ళిన దంపతుల నెందరినో చూసాడు. కాని విశ్వపతి వయసు ముప్పై కూడా దాటలేదు. ఈ చిన్న వయసు లోనే అనాధని చేరదీసి పెంచాలనుకుంటున్నాడంటే ఇతడెవరో చాలా ఆదర్శవంతుడన్న మాట" అనుకున్నాడు.

విశ్వపతిని కూర్చోమని కుర్చీ చూపించి అడిగాడు.

"మీకు పెళ్ళయిందా?"

"అయింది. ఆరేళ్ళ క్రితం"

'ఓహో అయితే ఇతడు కూడా ఆరేళ్ళు ఎదురు చూపే వచ్చాడన్నమాట" అనుకున్నాడు.

"మీకు ఆడపిల్ల కావాలా, మగపిల్లాడు కావాలా?"

కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు విశ్వపతి

"ఆడపిల్లే"

"ఓహ్! తల్లితండ్రులు ఆడపిల్లని కనడానికి భయపడుతున్న ఈ రోజుల్లో కావాలని ఆడపిల్లని కోరుకోవడం! నిజంగా ఇతడు చాలా ఉత్తముడు!"

ముసలాయన దృష్టిలో విశ్వపతి వ్యక్తిత్వం క్షణక్షణానికీ ఉన్నతమౌతోంది. అప్పుడే ఆ ముసలాయన టేబుల్ మీద గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి పెట్టింది ఒక పదేళ్ళ అమ్మాయి.

"ఏ వయస్సులో ఉన్న అమ్మాయి కావాలి?" అడిగాడు ముసలాయన మంచి నీళ్ళగాసు అందుకుని.

"ఇప్పుడొచ్చింది చూసారా! ఆ అమ్మాయంత ఉండాలి" సాధారణంగా ఆ వయసు లో ఉన్న పిల్లలనే ఎందుకు తీసుకువెళతారో కూడా ముసలాయనికి తెలుసు. ఒక[illegible] ప్రేమ అవసరం ఆ వయసులో పిల్లలకు బాగా తెలుస్తుంది. అటువంటి వాళ్ళని పెంచుకుంటే భవిష్యత్తులో తమ పట్ల ఎక్కువ విశ్వాసం, కృతజ్ఞత ఉంటుందనే హామీ మళ్ళీ విశ్వపతే అన్నాడు.

"ఎవరినో ఎందుకూ? ఆ అమ్మాయినే తీసుకు వెళ్తాను" అని.

ఆ ముసలాయనకేం అర్థం కావడం లేదు. ఎవరు తీసుకెళ్ళినా, పిల్లలందరినీ పిలిచి లైన్లో నిలబెట్టి, కన్నూ, ముక్కూ, తడిమి, ఒకసారి అటూ ఇటూ నడిపించి సకల పరీక్షలు చేసి తీసుకువెళతారు. అలాంటిది! ఇతడేమిటి ఇంత త్వరగా నిర్ణయం తీసుకున్నాడు?

"ఏమండి! నేను ఆ అమ్మాయని తీసుకెళ్ళ వచ్చా?"

"ఉండండి! మీకు కావాలన్నారు కాబట్టి నలుగు రైదుగురిని చూసి నచ్చిన పిల్లని తీసుకెళ్ళండి" అన్నాడు అతడు. వీలైనంత వరకూ విశ్వపతికి మేలు చేయాలని ఉంది ఆ ముసలాయనికి.

"వద్దులెండి. ఆ అమ్మయినే తీసుకువెళతాను" చెప్పాడు విశ్వపతి.

"ఆ అమ్మాయిని మీరు తీసుకు వెళ్ళలేరు"

"ఆదేం?"

"మరేం లేదు. ఆ అమ్మాయి మూగది. చూస్తు చూస్తూ అవిటిపిల్లని తీసుకు వెళ్తారా?"

"పర్వాలేదు. నేను ఆ అమ్మాయినే తీసుకు వెళ్తాను" స్థిరంగా చెప్పాడు విశ్వపతి. ఇక విశ్వపతి కేం చెప్పదలచుకోలేదు. అతడు డెస్కులోంచి ఒక అప్లికేషన్ ఫారం ఇచ్చి "ఇది నింపండి" అన్నాడు.

విశ్వపతి అప్లికేషన్ నింపుతుండగా అతడడిగాడు "మీరొక్కరే వచ్చారేం? మీ భార్యను కూడా తీసుకు రావలసింది కదా?" నిజమేనేమో అనిపించింది విశ్వపతికి. తన భార్య రేణుని కూడా తీసుకు రావలసింది. ఈ అమ్మాయి రేణుకి నచ్చుతుందో లేదో! అంతలోనే సర్దుకున్నాడు. "ఏం పర్వాలేదు. తనకి ఈ సలహా ఇచ్చింది రేణు కాదూ! ఛాయిస్ ఈజ్ యువర్స్ అని కూడా అంది. ఇప్పుడు మాత్రం ఎందుకు అభ్యంతరం చెప్తుంది?' అనుకున్నాడు.

"పర్వాలేదండి నా నిర్ణయమే మా ఆవిడ నిర్ణయం" అని అప్లికేషన్ పూర్తి చేసి అతడిచేతి చేతికిచ్చాడు.

"సరే అయిదు వందల రూపాయలు చెల్లించి, మీరా అమ్మాయిని తీసుకు వెళ్ళవచ్చు!"

విశ్వపతి అయిదు వందల రూపాయలు ఆ ముసలాయన చేతికిచ్చాడు. ఆ ముసలాయన లోపలికి వెళ్ళి పావుగంట తర్వాతల అమ్మాయితో బయటికి వచ్చాడు.

"నేను ఈ అమ్మాయికి అంతా వివరించాను. ఆనందంగా మీతో రావడానికి అంగీకరించింది. కనుక మీరు నిరభ్యంతరంగా ఈ అమ్మాయిని తీసుకు వెళ్ళవచ్చు" అని చెప్పాడు.

విశ్వపతి అతనికి థాంక్స్ చెప్పి ఆ అమ్మాయిని స్కూటర్ మీద ఎక్కించుకుని వెళ్ళిపోయాడు.

'ఒక క్షణం ఆ ముసలాయనికి దేవుడే ఆ రూపంలో వచ్చి తనని పరీక్ష చేస్తున్నాడా అనిపించింది. ఏమైనా ఇంతటి ఆదర్శవంతులని ఎక్కడా చూడలేదు' అనుకున్నాడు.

* * *

"రేణూ! చూడవోయ్! ఎవర్ని తీసుకొచ్చానో! వెంకి ఏభై రూపాయలిచ్చినా సరైన పనిమనిషి దొరక లేదని బాధపడుతున్నావు కదా! నీ సలహా ప్రకారమే అయిదు వందల రూపాయలకి పర్మనెంట్ పనిమనిషిని తీసుకొచ్చాను. నువ్వేమన్నా నీ నోట్లో నోరు పెట్ట డానికి ఈ అమ్మాయి మూగది కూడాను" ఇంట్లోకి అడుగు పెడుతూ భార్యకి చెప్పాడు విశ్వపతి. ○




భార్య:
"మీ పేరున ఒక కవరు వచ్చింది- 'పర్సనల్ అండ్ అర్జంట్ అని స్పష్టంగా రాసి వుంది"
భర్త:
"అలాగా ... అందులో ఏం రాసి వుంది?"
-వై. విజయ, విజయవాడ